క్లుప్తంగా

ప్రభుత్వ ఆస్పత్రిలో ఆర్ఐ భార్య ప్రసవం



బిడ్డను ఎత్తుకున్న సునీల్

బెల్లంపల్లి: మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ)గా విధులు నిర్వహిస్తున్న సునీల్ భార్య మౌనికకు గురువారం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పండంటి ఆడ బిడ్డకు ప్రసవించింది. భర్త.. మౌనికను ప్రసవం కోసం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లాడు. ఆమెను పరీక్షించిన సివిల్‌సర్జన్, గైనకాలజిస్ట్ కిరణ్‌కుమారి సాధారణ ప్రసవం చేయగా ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నట్లు వైద్యసిబ్బంది తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించడానికి ఆర్ఐ..తన భార్యకు ఏరియా ఆసుపత్రిలో ప్రసవం చేయించి ఆదర్శంగా నిలిచారు.

కిష్టాపూర్‌లో ప్రో కబడ్డీ టోర్నమెంట్



కిష్టాపూర్ జట్టుకు రూ.10వేల నగదు అందిస్తున్న నాయకులు

జైపూర్: మండలంలోని కిష్టాపూర్‌లో సంక్రాంతి సందర్భంగా గురువారం ప్రో కబడ్డీ టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల నుంచి 10 జట్లు ఈ పోటీల్లో తలపడ్డాయి. ఇందులో కిష్టాపూర్ జట్టు విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానంలో ఇందారం జట్టు నిలువగా, ప్రథమ బహుమతి కిష్టాపూర్ జట్టుకు రూ.10 వేల నగదును స్థానిక నాయకుడు చందుపట్ల జనార్ధన్‌రెడ్డి అందించారు. ఇందారం జట్టుకు ద్వితీయ బహుమతి రూ.5 వేలను పాపిరెడ్డి అందజేశారు. కిష్టాపూర్ జట్టుకు రూ.5వేలతో సత్తిరెడ్డి టీషర్ట్స్, ప్యాడ్స్ అందించారు. స్థానిక నాయకులు మనోహర్‌రెడ్డి, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కళాజాత



ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

దండేపల్లి: రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా దండేపల్లి, మేదరిపేట గ్రామాల్లో సాంస్కృతి సారధి కళాకారులు గురువారం కళాజాత ప్రదర్శన నిర్వహించారు. రోడ్డు నిబంధనలపై పాటల ద్వారా ప్రజలకు వివరించారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని, డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ మాట్లాడొద్దన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. కళాకారులు మురళీ, శ్రీనివాస్, రవీందర్, పోషన్న, రవికుమార్, నాగలక్ష్మి, నిరోష తదితరులు పాల్గొన్నారు.

'రేషన్' దరఖాస్తులను పరిశీలించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సతీశ్

నస్పూర్: ప్రతీ రేషన్‌కార్డు దరఖాస్తులను క్షణ్ణంగా పరిశీలించాలని మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీశ్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ పరిధిలో 1305 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. రేషన్ కార్డుకు వచ్చిన ప్రతీ దరఖాస్తును పరిశీలించి అర్హుల జాబితా సిద్ధం చేయాలన్నారు. అనంతరం వివిధ వార్డుల్లో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. సర్వేను పారదర్శకంగా నిర్వహించాలన్నారు.

భీమారం: మండల కేంద్రంలో రేషన్ కార్డుల లబ్ధిదారుల ఎంపికకు నిర్వహిస్తున్న సర్వేను గురువారం పంచాయతీ అధికారి కృష్ణమూర్తి పరిశీలించారు. అర్హులందరికీ రేషన్ కార్డులు అందిస్తామన్నారు.

పండ్లు పంపిణీ

మంచిర్యాలటౌన్: రామకృష్ణాపూర్‌కు చెందిన నూకల మోహన్‌రావు జ్ఞాపకార్థంగా ఆయన జయంతిని పురస్కరించుకుని మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలోని రెడ్ క్రాస్ బ్లడ్‌బ్యాంకులో రక్తమార్పిడి చేసుకుంటున్న తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు గురువారం పండ్లు పంపిణీ చేశారు. తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు రక్తదానం చేసేందుకు దాతలు ముందుకురావాలని రెడ్ క్రాస్ సభ్యులు కోరారు.

ఏఎస్‌వోలకు డ్రెస్‌కోడ్ వద్దా?

- సివిల్ డ్రెస్‌తో రాని గుర్తింపు
- వారికి తప్పని ఇబ్బందులు



మందమర్రిలోని ఎస్అండ్‌పీసీ కార్యాలయం

మందమర్రిరూరల్: సింగరేణిలో ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్లకు (ఏఎస్‌వో) డ్రెస్‌కోడ్ లేకపోవడంతో వారికి ఇబ్బంది తప్పడం లేదు. ఏరియాల్లో నిరసన, ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలు జరిగిన సందర్భాల్లో, ఏదైనా బందోబస్తులకు వెళ్లినప్పుడు సివిల్ డ్రెస్‌లో వెళ్తుంటారు. దీంతో వీరికి గుర్తింపు లేకుండా పోతోంది. కిందిస్థాయి సీనియర్, జూనియర్ ఇన్‌స్పెక్టర్, సెక్యూరిటీ గార్డులకు యూనిఫాంలు ఉన్నాయి. వారికి గుర్తింపు ఉండడంతో ఏఎస్‌వోలకు ఇబ్బందికరంగా మారింది. సెక్యూరిటీ సిబ్బందికి ఆ విభాగం నుంచి పదోన్నతిపై వచ్చేవారికి ఏఎస్‌వోగా యాజమాన్యం నియమిస్తోంది. దాంతో వారు విధులు నిర్వహించిన రోజులు సివిల్ డ్రెస్‌ల్లోనే ఉంటారు. కొంతకాలం తర్వాత బదిలీపై వాళ్లు వెళ్తారు. సెక్యూరిటీ గార్డులుగా విధుల్లో చేరి సీనియర్ ఇన్‌స్పెక్టర్ల వరకు పనిచేస్తున్న వారు, ఇతర విభాగాల నుంచి పై అధికారిగా (ఏఎస్‌వో) డ్రెస్‌కోడ్, విధి విధానాలు తెలియడం లేదు. కొన్ని సందర్భాల్లో తమకు ఇబ్బందిగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా ఏఎస్‌వోలకు సెక్యూరిటీ విధి విధానాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చి డ్రెస్‌కోడ్ యాజమాన్యం ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈవిషయమై ఇప్పటికే పలుమార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ఓ ఉన్నతాధికారి ద్వారా తెలిసింది.

డ్రెస్‌కోడ్ నిర్ణయించలేదు



ఏరియాల్లోని సెక్యూరిటీ ఆఫీసర్ (ఏఎస్‌వో)లకు యాజమాన్యం ఎలాంటి డ్రెస్‌కోడ్ నిర్ణయించలేదు. ఈ విషయంపై కార్పొరేట్ నుంచి ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

– ఏరియా జీఎం దేవేందర్, మందమర్రి

సామాజిక తనిఖీ ప్రజావేదిక



ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

కాసిపేట: మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.4.85 కోట్లతో వివిధ పనులు చేపట్టారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో డీఆర్‌డీవో కిషన్ ఆధ్వర్యంలో గురువారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. పలు గ్రామాల్లో అవకతవకలు జరిగినందుకు గాను జరిమానాతోపాటు, రికవరీకి డీఆర్‌డీవో ఆదేశించారు. ఇద్దరు ఎఫ్ఏలకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా, పంచాయతీలకు రూ.16,166 రికవరీకి ఆదేశాలు జారీ చేశారు. పెద్దనపల్లి, లంబాడితండా(కె) పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. సోమగూడెం(కె) పంచాయతీకి రూ.7,305, పెద్దనపల్లికి రూ.4,262, కోనూర్‌కు రూ.621, రొట్టెపల్లికి రూ.541, లంబాడితండా(డి)కు రూ.1,873, కోమటిచేనుకి రూ.517, మల్కేపల్లికి రూ.1,047 చొప్పున రికవరీకి ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక పేర్కొనగా ముందస్తు గురువారం నిర్వహించడంతో అనుకున్నస్థాయిలో కూలీలు, నాయకులు, ప్రజలు హాజరుకాలేదు. కార్యదర్శులకు ప్రభుత్వ పథకాలపై సర్వే ఉండటంతో తూతూమంత్రంగా సమావేశం నిర్వహించారు. రిసోర్స్ పర్సన్లు తనిఖీ చేసి అనంతరం వివరాలు వెల్లడించారు. మండల ప్రత్యేకాధికారి సాంబశివరావు, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంపీవో సబ్దర్‌అలీ, సోషల్ ఆడిట్ బృందం ఎస్‌పీఎం వేణు, ఎస్ఆర్పీ రంజిత్, డీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

బోరుబావికి మోటారు ఏర్పాటు

భీమారం: మండలంలోని కాజీపల్లి పరిధిలోని కుర్మవాడలో బోరుబావికి గురువారం మోటారు ఏర్పాటు చేశారు. గత కొన్నిరోజుల నుంచి నీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, బోరు బావికి మోటారు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి మోటారు అందించారని మండల కాంగ్రెస్ నాయకుడు రమేశ్ తెలిపారు.

సాగు భూములకే రైతుభరోసా



భీమారం: ధర్మారంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి కల్పన



జన్నారం: కొత్తపేటలో సర్వే చేస్తున్న తహసీల్దార్, ఏవో

- జిల్లా వ్యవసాయాధికారి కల్పన

భీమారం: సాగుభూములకే రైతు భరోసా అందుతుందని జిల్లా వ్యవసాయాధికారి కల్పన పేర్కొన్నారు. మండలంలోని ధర్మారం గ్రామంలో రైతు భరోసా పథకానికి అర్హుల కోసం జరుగుతున్న సర్వేలో గురువారం ఆమె పాల్గొన్నారు. మహిళ రైతుతో మాట్లాడారు. అనంతరం అక్కడే రికార్డులు పరిశీలించారు. వ్యవసాయ శాఖ వద్ద ఉన్న రికార్డుల ప్రకారం భూములు పరిశీలించిన అనంతరం ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. ఎంపీడీవో మధుసూదన్‌తోపాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. కాగా నర్సింగాపూర్‌లో రేషన్ కార్డుల సర్వేను కల్పన పరిశీలించారు.

నెన్నెల: మండలంలో రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు భరోసా కోసం గురువారం భూసర్వే చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సబ్బ రమేశ్ మాట్లాడుతూ నాలుగు బృందాలు నాలుగు రోజులపాటు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అర్హులైన రైతులతో కూడిన జాబితాలను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 21 నుంచి 24 వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఏవో సృజన, డీటీ ప్రకాశ్, ఈజీఎస్ ఏపీవో నరేశ్, ఏఈవోలు రాంచందర్, సుప్రజ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

తాండూర్: మండలంలో సాగేతర భూముల సర్వే గురువారం నిర్వహించారు. తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ ఆధ్వర్యంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది సర్వే నిర్వహించారు. కొత్తపల్లి శివారు ప్రాంతంలో గుర్తించిన వ్యవసాయేతర భూమిని పరిశీలించి సర్వే చేశారు. మండల ప్రత్యేక అధికారి కె.అంజయ్య, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఏవో సుష్మా, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, గిర్దావర్ ఇజాజుద్దీన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జన్నారం: మండలంలోని కొత్తపేట, కలమడుగు, రేండ్లగూడ, తపాలపూర్ గ్రామాల్లో వ్యవసాయ భూములపై సర్వే నిర్వహించారు. తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి, ఏవో సంగీత ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి సర్వే చేసి వివరాలు సేకరించారు. ఆర్ఐ భానుచందర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాల్లోని గ్రామాల్లో గురువారం వ్యవసాయ, పంచాయతీ అధికారులు వ్యవసాయ భూములపై సర్వే చేపట్టారు.

ఎంపీఎల్ విజేతలకు బహుమతులు



బహుమతి అందిస్తున్న శ్రీధర్, రవి తదితరులు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని శివాజీ మైదానంలో గత పదిరోజులుగా మంచిర్యాల ప్రీమియం లీగ్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన ఎస్ఆర్‌హెచ్, గుడిపేట్ టైటాన్స్ మధ్య ఫైనల్ జరిగింది. ఈ పోరులో విజేతగా నిలిచిన గుడిపేట్ టైటాన్స్, రన్నర్‌గా ఎస్ఆర్‌హెచ్‌లు నిలిచాయి. గురువారం అంజనీపుత్ర అధినేత గుర్రాల శ్రీధర్, ఎండీ పిల్లి రవిలు గురువారం విజేత జట్టు గుడిపేట టైటాన్స్‌కు రూ.లక్ష నగదు బహుమతితోపాటు ట్రోఫీ అందించారు. వసుధ, కెల్విన్ ఆసుపత్రులకు చెందిన సన్నీ పటేల్, కొమ్ము శ్రీనివాస్, ఉదారి చంద్రమోహన్‌గౌడ్‌లు రన్నరఫ్ నిలిచిన ఎస్ఆర్‌హెచ్ జట్టుకు రూ.50 వేలు అందించారు. గురు క్రికెట్ అకాడమీ నిర్వాహకులు దుర్గాప్రసాద్, బింగి శివకిరణ్, వైద్య ప్రశాంత్, శ్రీనివాస్, బొంతల శివ, లక్ష్మణ్, సంతోశ్, అంజనీపుత్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సూరినేని కిషన్, కాసర్ల సదానందం పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడి జయంతి



దుప్పట్లు అందజేస్తున్న సభ్యులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు మెల్విజ్ జోన్స్ జయంతిని గర్మిళ్ల లయన్స్ క్లబ్ సభ్యులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఆలయ ఆవరణలో దివ్యాంగులు, నిరుపేదలు, అనాథలకు దుప్పట్లు పంపిణీ చేశారు. గర్మిళ్ల లయన్స్ క్లబ్ సభ్యులు శంకర్‌లింగం, జోన్ చైర్‌పర్సన్ కుంకుముట్టి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి వేముల ప్రవీణ్, సీనియర్ సభ్యుడు రాంచందర్ పాల్గొన్నారు.

వ్యర్థాలు తొలగించరూ..



భీమారం: భీమారం సమీపంలో నిర్మించిన గొల్లవాగు ప్రాజెక్ట్ నుంచి ప్రధాన కాలువ ద్వారా పంట పొలాలకు సాగునీరందుతోంది. అయితే ప్రధాన కాలువలో వ్యర్థాలు పేరుకుపోవడంతో సక్రమంగా నీరందడం లేదు. ఎప్పటికప్పుడు వేసవిలో వ్యర్థాలు తొలగించాల్సి ఉంది. నీటిపారుదల శాఖ అధికారులు నామమాత్రంగా పనులు చేపట్టడంతో కాలువలో ఏటా వ్యర్థాలు నిండి దర్శనమిస్తున్నాయి. దీంతో పంట పొలాలకు సక్రమంగా నీరందడం లేదని రైతులు పేర్కొంటున్నారు. యాసంగి సీజన్‌లో పంట కోతలు పూర్తయ్యాక భీమారం నుంచి కొత్తపల్లి వరకు కాలువని శుభ్రం చేయాలని వారు కోరుతున్నారు.

బొగ్గుబాయి వార్తలు



రూఫ్‌బోల్టు, పాత ఐరన్‌రాడ్డుతో చేసిన సైకిల్ ఆకృతి



డంపర్ జాక్‌తో చేసిన ఫిరంగీ ఆకృతి

స్క్రాప్‌తో ఆకృతులు



టైర్ల రీములతో చేసిన ఒలింపిక్ లోగో

శ్రీరాంపూర్: ఆలోచన ఉండాలనే కాని ఏది వ్యర్థం కాదని శ్రీరాంపూర్ ఓసీపీ అధికారులు, ఉద్యోగులు నిరూపిస్తున్నారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్టు ప్రాజెక్టు అధికారి కార్యాలయం ఆవరణ పచ్చదనంతో కళకళలాడుతోంది. ఇనుప స్క్రాప్‌తో తయారీ చేసిన ఫిరంగి, ఒలింపిక్ లోగో, సైకిల్‌తోపాటు ఇతర ఆకృతులు ఆకట్టుకుంటున్నాయి. ఇవన్నీ హెమ్ సెక్షన్‌లో యంత్రాలను రిపేరు చేసే క్రమంలో పనికిరాని ఇనుప వ్యర్థాలు, స్పేర్స్‌తో చేశారు. డంపర్ జాక్‌తో ఫిరంగి, పాత టైర్ రీములతో ఒలింపిక్స్ చిహ్నం, పాత రూఫ్‌బోల్టులతో సైకిల్‌ను తయారు చేశారు. ఆవరణలో పూల మొక్కలకు వాడిన కుండీలు కూడా వాడిపడేసిన టైర్ డెస్కులతో చేసినవే కావడం గమనార్హం. హెమ్ సెక్షన్‌లోని అధికారులు, ఉద్యోగులు కలిసి కొన్నినెలల క్రితం వీటిని అందమైన ఆకృతులుగా మలిచి ఇక్కడ ఏర్పాటు చేశారు. పీవో కార్యాలయానికి వచ్చిన వారంతా వీటిని చూసి మురిసిపోతున్నారు.


జీఎంతో స్టాండింగ్ కౌన్సిల్ అడ్వొకేట్ భేటీ



హర్షారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న జీఎం ఎల్వీ సూర్యనారాయణ

శ్రీరాంపూర్: హైకోర్టులో సింగరేణి స్టాండింగ్ కౌన్సిల్ అడ్వొకేట్ హర్షారెడ్డి గురువారం శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణతో భేటీ అయ్యారు. శ్రీరాంపూర్ పర్యటనకు వచ్చిన ఆయన జీఎం కార్యాలయంలో సూర్యనారాయణను మర్యాద పూర్వకంగా కలిశారు. జీఎం ఆయనకు పుష్పగుచ్ఛం అందించి ఏరియాలో ఉన్న న్యాయ సంబంధిత కేసులపై చర్చించారు. కోర్టు కేసులను త్వరగా పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటుజీఎం ఎన్.సత్యనారాయణ, ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, ఇందారం ఓసీపీ ప్రాజెక్టు అధికారి ఏవీ రెడ్డి, డీజీఎం(పర్సనల్) పి.అరవిందరావు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే పై సమీక్ష



మాట్లాడుతున్న జీఎం

మందమర్రిరూరల్: ఈనెల 26న సింగరేణి హైస్కూల్ మైదానంలో సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించే రిపబ్లిక్ డే వేడుకలపై జీఎం ఆఫీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏరియా జీఎం దేవేందర్, అధికారులకు పలు సూచనలు చేశారు.

కారుణ్య నియామకపత్రాల అందజేత



నియామకపత్రాలు అందుకున్న వారితో ఏరియా జీఎం దేవేందర్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని జీఎం కార్యాలయ ఆవరణంలో 8 మంది డిపెండెంట్లకు ఏరియా జీఎం దేవేందర్ గురువారం కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణిలో ఉద్యోగాన్ని అదృష్టంగా భావించి గైర్హాజరు లేకుండా విధులకు హాజరై సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలన్నారు.

ఏరియా భవిష్యత్‌పై దృష్టి సారించాలి

మందమర్రిరూరల్: సింగరేణిలో మందమర్రి ఏరియా ఉజ్వల భవిష్యత్ కోసం అధికారులు కృషి చేయాలని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవీ భూమయ్య పేర్కొన్నారు. ఏరియాలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏరియా భవిష్యత్ పట్ల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. దశాబ్దకాలం కింద ఉన్న కార్మికుల కంటే ఇప్పుడు సగం మంది తగ్గారన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఏరియాలోని ఆర్కే ఓసీ గని కాల పరిమితి బొగ్గు నిల్వలు ఉన్నప్పటికీ కూడా మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ నాయకులు నరేందర్, భాస్కర్, శంకర్‌రావు, వెంకటస్వామి, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

రేపటి టోకెన్ సమ్మెను విజయవంతం చేయండి

జైపూర్: ఎస్టీపీపీ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, అన్ని అలవెన్సులతోపాటు వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించే ఒక్కరోజు టోకెన్ సమ్మెను విజయవంతం చేయాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పవర్ ప్లాంటు ప్రధాన గేటు ముందు నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. యాజమాన్యం పవర్ ప్లాంటు కార్మికులపై ఎన్నో ప్రలోభాలు చేసి సమ్మెను విచ్ఛిన్నం చేయాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. ఎస్టీపీపీలో గల అన్ని డిపార్టుమెంట్ల కార్మికులు సమ్మెలో పాల్గొనాలని కోరారు. శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ సారయ్య, లక్ష్మణ్, ఎస్టీపీపీ జనరల్ సెక్రెటరీ విక్రమ్, ఉపాధ్యక్షుడు సాయికృష్ణారెడ్డి, ప్రచారకార్యదర్శి నర్సింహారెడ్డి, సత్యనారాయణచారి, రాజు, కోటయ్య, కార్మికులు పాల్గొన్నారు.

పరామర్శ

శ్రీరాంపూర్: పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న షాట్ ఫైరర్ మేడ అజయ్‌ను సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు గురువారం పరామర్శించారు. జీడీకే 11 గనిలో పని చేస్తున్న అజయ్‌ను అదే గనికి చెందిన హెడ్ ఓవర్‌మెన్ దాడి చేయడంతో గాయాల పాలయ్యాడు. ఈ సందర్భంగా అసోసియేషన్ శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు దేగల ప్రవీణ్‌కుమార్ ఆయన్ను పరామర్శించారు. కులం పేరుతో దూషించి దాడి చేసిన హెడ్ ఓవర్‌మెన్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కంపెనీ అధికారులు ఆయనపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

మంచిర్యాలక్రైం: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపొద్దన్నారు. డ్రైవర్లు తమవెంట వాహనపత్రాలు తెచ్చుకోవాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.